క్లుప్తంగా

విశ్వేశ్వరునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ కాశీ విశ్వేశ్వరుడు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో కాశీ విశ్వేశ్వరునికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలమూర్తికి సామూహికంగా భక్తులు పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య తెల్లవారుజామున భక్తులు శుద్ధ జలం, క్షీరం, నారికేళ జలం తదితర ద్రవ్యాలతో విశేష అభిషేకం చేశారు. అనంతరం భక్తులు సమర్పించిన పూలు, మారేడు దళాలతో పూజలు నిర్వహించారు. అష్టోత్తర నామావళి, దూప దీప నైవేద్యం, మహామంగళహారతి తదితర కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్రీడాకారులకు చేయూత



క్రీడాకారులకు రవాణా చార్జీలు అందిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

కడప స్పోర్ట్స్ : సెప్టెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు ఆగ్రాలో నిర్వహించనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు ఏపీ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆర్థికసాయం అందించారు. తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా నుంచి ఏడుగురు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవగా వారు ఆగ్రా వెళ్లేందుకు అవసరమైన రవాణా చార్జీలను ఒక్కొక్క క్రీడాకారుడికి రూ.2 వేలు చొప్పున ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ప్రొద్దుటూరులో క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి నాయబ్‌రసూల్, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, మధుసూదన్, గంగాధర్, సలీం, క్రీడాకారులు ఫాతిమ, కల్యాణ్, సాయికృష్ణ, తేజ, భరత్, ఖాసీం, మౌనిక, నదీష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ విద్యార్థి నాయకుడికి నివాళి

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లాలో విద్యార్థి నాయకుడిగా పని చేసి విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మాధవరం రవీంద్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రవి శంకర్ రెడ్డి, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ అన్నారు. ఆదివారం ఆర్ఎస్‌యూ, ఏఐఎస్‌బీల ఆధ్వర్యంలో రవీంద్ర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు ప్రయోజనకరం



ఉచిత వైద్య శిబిరం ప్రారంభిస్తున్న గోవిందు నాగరాజు

కడప రూరల్ : ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు తెలిపారు. హ్యాండ్ ఫోర్ యూ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక కృష్ణాపురంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. జిల్లాలోని ప్రముఖ ఆసుపత్రులకు చెందిన వైద్యులు పాల్గొని సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డెయ్య యాదవ్, కల్యా సుధాకర్, కొండయ్య, మడక చక్రధర్, ఓబుల్‌రెడ్డి, తివిక్రమ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్ జబ్బులపై సదస్సు



డాక్టర్ ఓబులేశుకు బహుమతి అందజేస్తున్న వైద్య నిపుణులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఆదివారం సర్జరీ పీజీ విద్యార్థులకు ఫాతిమా మెడికల్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. సర్జరీ ప్రొఫెసర్లు తిరుపతి స్విమ్స్‌కు చెందిన డాక్టర్ ముక్తీశ్వరయ్య, డాక్టర్ శ్రీహరిరావు, అపోలో మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ రామకృష్ణ, కుప్పం మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ చెన్నప్ప, తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిలు హాజరయ్యారు. పీజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో తిరుపతి ఎస్వీ ఎంసీ పీజీ విద్యార్థులు ప్రథమ స్థానం, ఫాతిమా వైద్యకళాశాల పీజీ విద్యార్థులు ద్వితీయస్థానం దక్కించుకున్నారు. కడప సర్జరీ ప్రొఫెసర్లు డాక్టర్ టి.గిరిధర్, డాక్టర్ పి.కృష్ణకిశోర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాదర్ బాషా, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి హాజరు కాగా, ఆర్థో ప్రొఫెసర్ డాక్టర్ నాగేష్, ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఓబులేశు పాల్గొన్నారు.



కడప కలెక్టరేట్ వద్ద ఎస్టీఎఫ్ నాయకుల నిరసన



ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ 257 సంఘ నాయకులు



తహసీల్దారు కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్-1938 నాయకుల నిరసన

గళమెత్తిన గురువులు

- భాగస్వామ్య పెన్షన్ పథకాలపై పోరు
- కలెక్టరేట్ వద్ద ధర్నా, నిరసన
- పాల్గొన్న పలు ఉపాధ్యాయ సంఘాలు



కడప కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం ప్రవేశ పెట్టే భాగస్వామ్య పెన్షన్ పథకాలైన సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను అంగీకరించేదేలేదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో సెప్టెంబరు-1 ఉద్యోగ, ఉపాధ్యాయులకు చీకటి రోజని సామాజిక, ఆర్థిక భద్రత లేని భాగస్వామ్య పెన్షన్ విధానాన్ని ఉద్యోగుల మెడకు చుట్టిన రోజు అని ఆయన విమర్శించారు. దేశం, రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయుల అభిమతానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న మరొక కొత్త భాగస్వామ్య పెన్షన్(యూపీఎస్) విధానాన్ని ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇందుకు నిరసనగా ఆదివారం కడప జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం ఎదురుగా ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కడప జిల్లా ఎస్టీయూ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన సీపీఎస్, జీపీఎస్ లాంటి భాగస్వామ్య పెన్షన్ విధానాలు మాకొద్దు అని ఎన్డీఏ కూటమికి ఉపాధ్యాయ, ఉద్యోగస్తులు బహిరంగ మద్దతుతో గెలిపించడం జరిగిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ అనే కొత్త భాగస్వామ్య పెన్షన్ విధానాన్ని అమలు చేయబోతున్నట్లు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ విధానం గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పెన్షన్ల కంటే మెరుగైనది కాదని, ఇవన్నీ ఒకటేనని అన్నారు. ఓపీఎస్ మాత్రమే ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆమోద యోగ్యం తప్ప మరి ఏ ఇతర స్కీమ్‌లు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు సురేష్‌బాబు, సుబ్రహ్మణ్యం రాజు, బాలగంగిరెడ్డి, రమణారెడ్డి, రామమోహన్, సుధాకర్‌రెడ్డి, దాదాపీర్, రవిశంకర్‌రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, బాలరాజు యన్.వి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఎఫ్ ఆధ్వర్యంలో..

యూపీఎస్‌కు నిరసనగా ఎస్టీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల జీతం నుంచి కోత లేకుండా ఉండేటువంటి పెన్షన్‌ను మాత్రమే కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా గౌరవ సలహాదారు కిష్టపర్‌జాన్, జిల్లా ట్రెజరర్ శ్రీనివాసులు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజగోపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, బాలకృష్ణ, సాగర్, రవి, శంకర్, శ్రీరాంలతోపాటు పలు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ - 257 ఆధ్వర్యంలో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సీపీఎస్, యూపీఎస్‌లకు ఏపీటీఎఫ్-257 వ్యతిరేకమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. ఇందుకు నిరసనగా ఆదివారం కడపలోని తహసీల్దారు కార్యాలయం ఎదట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్స్ శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, రాజారావు, మణికుమార్, మస్తాన్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ -1938 ఆధ్వర్యంలో..

సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లు ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కాదని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాళ్లపల్లి అబ్దుల్లా డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ కడప కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ నాయకులు ధర్నా చేశారు. 2004 సెప్టెంబర్ 1వ తేదీ అమలు చేసిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పలు దఫాలుగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దస్తగిరి, సురేంద్ర, సుబ్బారెడ్డి, వేణుమాధవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ ఆధ్వర్యంలో..

సీపీఎస్, యూపీఎస్‌లు అనేది ప్రభుత్వ ఉద్యోగుల మేడ మీద వేలాడుతున్న కత్తి అని బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్యోతి రామచంద్ర, డాక్టర్ హరికొండయ్య అన్నారు. కడపలోని బీటీఏ కార్యాలయంలో బీటీఏ నాయకులు ఇందుకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానంలో ఉద్యోగులు నష్టపోతారన్నారు. ఈ కార్యక్రమంలో బీటీఏ నాయకులు గూడూరు పెంచలయ్య, జయరామ్, మధుసూదన్, సూర్యప్రకాష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

యూపీఎస్‌తో జీవన భద్రత లేదు

యూపీఎస్‌తో ఉద్యోగులకు జీవన భద్రత లేదని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, నాగూరుప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనిఫైడ్ పెన్షన్ పథకంతో ఉద్యోగులకు జీవన భద్రత లేదన్నారు. ఉద్యోగులంతా కోరుకునే పాత పెన్షన్ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఘన వీడ్కోలు



చామా శ్రీనివాసులరెడ్డి దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



తోట వెంకట పద్మజ దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్ ఫిజికల్ డైరెక్టర్ చామా శ్రీనివాసరెడ్డి ఉద్యోగ విరమణ ఆత్మీయ సమావేశం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప మండల విద్యాశాఖాధికారి డి.గంగిరెడ్డి విచ్చేసి మాట్లాడారు. 44 ఏళ్లుగా పని చేసి ఎందరో క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ మాజీ ఖోఖో క్రీడాకారుడు రమణయ్య మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి శిక్షణలోనే తాను అంతర్జాతీయస్థాయి ఖోఖో ఆడగలిగానని తెలిపారు. ఆంధ్రా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఉంగరాల శేఖర్‌బాబు మాట్లాడుతూ తమ లాంటి ఎందరో క్రీడాకారులకు మార్గదర్శనం చేసిన గొప్ప ఫిజికల్ డైరెక్టర్ అని కొనియాడారు. అనంతరం ఎస్టీయూ మున్సిపల్ విభాగం స్టేట్ కన్వీనర్ టి.రవి శంకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కిరణ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణ, సాజిత్, విజయలక్ష్మి, బాలయల్లారెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం చామా శ్రీనివాసరెడ్డి, రేణుకాదేవి దంపతులను ఆయన శిష్యులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు సత్కరించారు.

ఆదర్శ ఉపాధ్యాయురాలు

ఉపాధ్యాయ జీవితంలో ఎందరినో ఉన్నతంగా తీర్చిదిద్దిన ఆదర్శ ఉపాధ్యాయురాలు తోట వెంకట పద్మజ అని కడప ఎంఈఓ డి.గంగిరెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని అమరస్వామి ఫంక్షన్‌హాల్‌లో 20వ వార్డు నగరపాలక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు తోట వెంకట పద్మజ ఉద్యోగ విరమణ, అభినందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం యాస్మిన్ బేగం, నగర ప్రముఖులు బి.హరిప్రసాద్, అమరప్ప, నాగరాజు, బండి బాబు తదితరులు పద్మజ సేవలను కొనియాడారు. అనంతరం తోట పద్మజ, బండారు జగన్నాథరావు దంపతులను ఉపాధ్యాయులు, బంధుమిత్రులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శివారెడ్డి, పీఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పి.వి.సుబ్బారెడ్డి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రచనలు జాతి వారసత్వ సంపద



పుట్టపర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, టూరిజం సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యుల రచనలు జాతికి వారసత్వ సంపద లాంటివని, వాటిని రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం పుట్టపర్తి నారాయణాచార్యుల వర్ధంతిని పురస్కరించుకొని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో పుట్టపర్తి చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు మిగతా కవులతో పోలిస్తే ఎంతో విభిన్నమైన వారని, శిఖర సమానులని కొనియాడారు. పుట్టపర్తి రచనలను విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఉందని, ఆయన సాహిత్యాన్ని సమగ్రంగా సేకరించి ప్రచురించి తెలుగు వారందరికీ అందుబాటులో ఉంచాలని కోరారు. ఆయన జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించడం జిల్లా వాసులకు గర్వకారణంగా భావించాలన్నారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు సాహిత్య రంగంలో శిఖర సమానులని, మహా పండితుడైన ఆయన 14 భాషల్లో ప్రావీణ్యం గల వారని చెప్పుకునేందుకు జిల్లా వాసిగా గర్విస్తున్నానని తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు తెలుగు నాట మరే కవితోనూ పోల్చలేని అసమాన కవి అని కొనియాడారు. వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, బాల ఎల్లారెడ్డి కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, మధు బాబు, డేవిడ్, గొబ్బూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో..

కడప ఎడ్యుకేషన్ : తమిళ, కన్నడ, మలయాళం, మరాఠి, ఉర్దూ భాష నవలలను కవి పుట్టపర్తి నారాయణాచార్యులు తెలుగులో అనువదించారని సాయిబాబా అనాథాశ్రమ కార్యదర్శి బద్రీనాథ్ అన్నారు. ఆదివారం కడపలోని ఆర్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరిముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంతోనే మనుగడ



వేదికపై వీహెచ్‌పీ ప్రముఖులు

కడప కల్చరల్ : సనాతన ధర్మంతోనే భావి తరాలకు మనుగడ ఉంటుందని విశ్వహిందూ పరిషత్ అఖిల భారత మార్గదర్శక మండలి సభ్యులు, బ్రహ్మంగారిమఠం శ్రీ అచలానందస్వామి ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ హిందూ సమావేశం ఆదివారం కడప నగర శివారులోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మనదేశం విలువలకు పట్టం కడుతుందని, సనాతన ధర్మాన్ని వంద శాతం పాటిస్తుందని, ఆ పునాదులపైనే ఎన్ని కడగండ్లు ఎదురైనా లెక్కచేయక ముందుకు సాగుతోందన్నారు. ఈ ధర్మాన్ని పాటించినపుడే దేశం సస్యశ్యామలంగా విలసిల్లగలదన్నారు. చిన్మయ మిషన్ అధ్యక్షులు, వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత మార్గదర్శక మండలి సభ్యులు స్వామి తురియానంద సరస్వతి మాట్లాడుతూ భారతదేశం సనాతన ధర్మానికి ఎంతో విలువనిస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ధర్మానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని, హిందువులంతా ఈ పరిస్థితిని అధిగమించాలన్నారు. అనంతరం వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన్ కార్యదర్శి గుమ్మళ్ల సత్యం మాట్లాడుతూ వీహెచ్‌పీ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎదుర్కొన్న కడగండ్లు, విజయవంతంగా ముందుకు వెళుతున్న క్రమం గురించి వివరించారు. వీహెచ్‌పీ పూర్వ ప్రాంత అధ్యక్షులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు కూడా మార్గదర్శనం చేస్తూ భవిష్యత్తులో హిందువులు ఐక్యంగా ఉండాల్సిన అవసరం గురించి తెలియజేశారు. దక్షిణాంధ్ర ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ బెస్త వేముల రామమహేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సంస్థ జిల్లా ఉపాధ్యక్షులు హేమమాలిని, వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా నలు మూల నుంచి దాదాపు 1200 మందికి పైగా కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా హిందూ ధార్మిక సంస్థలు శ్రీరాముని పేరిట పవిత్ర అక్షతలను కార్యకర్తలకు పంపిణీ చేశారు.

కృష్ణా జలాలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కృష్ణా జలాల వివాదంపై పోరాడటానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో నగర కమిటీ ఆధ్వర్యంలో శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గత తీర్పులకు విరుద్ధంగా కృష్ణా జలాల పునఃపంపిణీకి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి కరువు రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కడపలో చెత్త పంచాయితీలు పక్కనపెట్టి.. ప్రజల వ్యక్తిగత, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై పి.డి.యాక్ట్ పెట్టడంపై దృష్టి కేంద్రీకరిస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. భారతదేశంలో జీవించి ఉన్న అతిపురాతన కమ్యూనిస్టు నేత వీ.ఎస్.అచ్యుతానందన్ వంటి వారి అనుభవాలు ఆదర్శంగా తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కడప నగర కార్యదర్శి ఏ.రామ్మోహన్ నగర కమిటీ సభ్యులు జమీల, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చంద్రారెడ్డి, గోపాలకృష్ణ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు.. పర్యావరణానికి మేలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిషనర్, మున్సిపల్ కార్మిక నాయకులు

కడప కార్పొరేషన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ అన్నారు. 'మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకుందాం' అంటూ మున్సిపల్ కార్మికులు రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల భూమి, నీరు కలుషితం అవుతాయని, మట్టి విగ్రహాలతో పర్యావరణం పరిరక్షించబడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కార్మికులు కూడా పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట మట్టి విగ్రహాన్నే ఏర్పాటు చేస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు కిరణ్ కుమార్, వెంకటేశు, నాగరాజు, నరసింహులు, శివ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ఇన్‌చార్జి వీసీని తొలగించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ కృష్ణారెడ్డిని వెంటనే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, అధ్యక్షుడు కే శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఆచార్య కే కృష్ణారెడ్డి గత ప్రభుత్వంలో కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా ఉన్నప్పుడు అవినీతి, అక్రమాలు, అనైతిక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఏసీబీ విచారణ కూడా చేసిందన్నారు. వైవీయూ ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు కొంత మంది మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడటం వంటి కార్యకలాపాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆయన ఎన్ని అరాచకాలకు పాల్పడ్డారో అన్నింటికీ ఆధారాలు ఉన్నాయన్నారు. విచారణ కమిటీలో తన అనుకూలమైన వారిని, తన కంటే కింది స్థాయి వారిని నియమించడంతో.. తూతూ మంత్రంగా విచారణ చేశారని ఆరోపించారు. యూజీసీ నిర్దేశాల ప్రకారం విచారణ జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు అరుణ్‌కుమార్, నగర ఉపాధ్యక్షులు తేజ అక్కిరానంద్, చంద్ర, అశోక్, రాజేష్, నరసింహ, మస్తాన్, గణేష్, ఫహీద్, షరీఫ్, సాయి పాల్గొన్నారు.

వర్షపునీటి నిల్వలను తొలగించాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తక్షణం తొలగించాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. ఆదివారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నీరు నిలువ ఉండడంతో ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌తో కలిసి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం పరిశీలించారు. నీటిని బయటికి పంపే ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వైఓ నందన్, రీజనల్ మేనేజర్ ఆర్టీసీ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

6న కలెక్టరేట్ ఎదుట ఆందోళన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 6న జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరల కారణంగా పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఏం కొనేట్టు లేదు. ఏం తినేట్టు లేదన్నారు. దీనికితోడు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా పెంచిందన్నారు. పేదల ఆదాయం పెరగకుండా ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారుతోందన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన ఆందోళనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటశివ, సుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, బాదుల్లా, భాస్కర్, టి.రామ్మోహన్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవ్వను ఆదుకోవాలి



రోడ్డు పక్కన నివసిస్తున్న రాజమ్మ

కడప కోటిరెడ్డిసర్కిల్ : అన్నమయ్య జిల్లా పీలేరు వద్దగల తాటిగుంట పాలెంకు చెందిన రాజమ్మ గత కొన్ని రోజులుగా నగరంలోని ఎన్జీఓ కాలనీ, అప్సర సర్కిల్ ప్రాంతాల్లో రోడ్డుపై నివసిస్తోంది. తమ కుటుంబ సభ్యులు గతంలో తనతోపాటు తన భర్తను కడపకు తీసుకొచ్చి వదిలివేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అయితే తన భర్త అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో తాము రోడ్డుపాలు కావడం జరిగిందన్నారు. తనకంటూ ఎవరూ లేరని, రోడ్డు పక్కన ఉండడంతో ఎవరో ఒకరు సమయానికి భోజనం అందిస్తున్నారని తెలిపారు. మానవతా వాదులు తమను ఆదుకోవాలని కోరుకుంటోంది.

మహిళ అదృశ్యం



సుభాషిణి (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధి శంకరాపురంలోని స్కాట్ హాల్ సమీపంలో నివాసం వుంటున్న హరిజగిరి సుభాషిణి (54) అనే మహిళ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటిలో ఎవరూ గమనించని సమయంలో బయటకు వచ్చేసి ఎటో వెళ్లిపోయింది. తరువాత కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికారు. సుభాషిణి కుమార్తె తేజస్విని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.రవికుమార్ తెలియజేశారు.

రైతులకు 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' రుణాలు ఇవ్వాలి



ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో రైతులను విముక్తి చేసేందుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏఐకేఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల నుంచి సరైన వర్షాలు లేక వేసిన పంటలు చేతికి రాక రైతాంగం అప్పుల పాలు అయిందన్నారు. కావున రైతులకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం తిరిగి నూతన రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలని పేర్కొన్న డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పొలాల్లో సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు నివారణ మందులు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. రైతాంగానికి సాగు సాయం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలు తక్షణం ఇవ్వాలన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించి, పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రాజెక్టుల కింద పంట కాలువలు పూర్తి చేయడం ద్వారా వ్యవసాయానికి సాగునీరు, గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రైతులను ఉచిత విద్యుత్ నుంచి దారి మళ్లించడానికి చేస్తున్న ప్రయత్నాలకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ మనోహర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.వెంకట్ శివ, సి. సుబ్రహ్మణ్యం, కే బాదుల్లా, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.